4తో ముగియనున్న జడ్పీ పాలకవర్గ గడువు

- ఐదేండ్లలో రూ.6,78,56,735 నిధుల మంజూరు
- కాంగ్రెస్ పాలనలో పైసారాని వైనం
- షట్టర్ల అద్దె ఆదాయమే శరణ్యం
- 3న జనరల్ బాడీ సమావేశం

హనుమకొండ, జూన్ 30 : ఈ నెల 4వ తేదీతో వరంగల్ అర్బన్ జిల్లా పరిషత్ పాలకవర్గ గడువు ముగియనుంది. 2019 జూలై 5న బాధ్యతలు చేపట్టిన పాలకవర్గ పదవీకాలం బుధవారంతో పూర్తికానుంది. హనుమకొండ జిల్లాలో ఏడుగురు జడ్పీటీసీలు, ఇద్దరు కో ఆప్షన్ మెంబర్స్ ఉన్నారు. వీరి ఆధ్వర్యంలో ఆయా మండల పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, బోర్ వెల్స్, తాగునీరు, పైప్‌లైన్, డ్రెయినేజీ కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈ ఐదేళ్లలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు స్టేట్ ఫైనాన్స్ ద్వారా కలిపి మొత్తం రూ.6,78,56,735 నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 279 పనులు పూర్తి చేసినట్లు జడ్పీ అధికారులు చెబుతున్నారు. కాగా, ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఒక రూపాయి కూడా మంజూరు కాలేదు. దీంతో జడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు. కేవలం సమావేశాలకు, ఇంటికి మాత్రమే పరిమితం అవుతున్నారు. కార్యాలయంలో చాయ్, బిస్కట్లకు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తోందని అంటున్నారు. అయితే జడ్పీకి ఉన్న షట్టర్ల అద్దెల ద్వారా వస్తున్న డబ్బులతోనే సర్దుకుంటున్నట్లు చెబుతున్నారు. కాగా, 3న జనరల్ బాడీ సమావేశం నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

ఏడుగురు జడ్పీటీసీలు

జిల్లాలోని భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ఐనవోలు, కమలాపూర్, వేలేరు మండలాలకు ఒక్కో జడ్పీటీసీ ఉనారు. వీరిలో నుంచి చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ప్రస్తుత జడ్పీ పాలకవర్గం పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ ఐదేండ్లలో రూ.6,78,56,735 నిధుల మంజూరైనట్లు తెలుస్తున్నది. వీటిలో 15వ ఆర్థిక సంఘం (కేంద్రం) నుంచి మొత్తం 3,73,73,165, స్టేట్ ఫైనాన్స్ ద్వారా రూ.3,04,83,670 వచ్చాయి. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి 2020-21 సంవత్సరానికి రూ.84,37,157, 2021-22 సంవత్సరంలో రూ.93,84,833, 2022-23 సంవత్సరానికి రూ.97,24,046, 2023-24 సంవత్సరానికి రూ. 98,27,129 నిధులు వచ్చాయి. స్టేట్ ఫైనాన్స్ నుంచి స్పెషల్ గ్రాంట్ ద్వారా 2021-22 సంవత్సరానికి రూ.1,73, 00,663, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ కింద 1,31,82,907 వచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శివ(ఫైల్)

ఖానాపురం, జూన్ 30: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన మానెపల్లి శివ(35) ప్రైవేట్ గోదాంలో గుమస్తాగా పని చేస్తూ ఓ దినపత్రికలో కంట్రిబ్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శివ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఇటీవల ఉద్యోగం కోసం రూ. 4 లక్షల అప్పు చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపం చెందిన అతడు ఈ నెల 28న పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. విషయాన్ని ఫోన్‌లో కుటుంబ సభ్యులు చెప్పాడు. వారు ఘటనా స్థలానికి వెళ్లి అతడిని నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు భార్య లత, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావుతోపాటు జర్నలిస్టులు పరామర్శించారు.

నేడు గడ్డం సమ్మయ్య అభినందన సభ

దేవరుప్పుల, జూన్ 30 : ప్రముఖ చిందు కళాకారుడు గడ్డం సమ్మయ్య ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్న నేపథ్యంలో వారి స్వగ్రామమైన మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ మేరకు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో సాయంత్రం 5గంటలకు నిర్వహించే సభకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య హాజరుకానున్నారు.

మెజార్టీ సభ్యుల అభిప్రాయమే ఫైనల్

డీసీవో నాగేశ్వర్‌రావు

ప్రత్యేక మహాజనసభలో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు, పాల్గొన్న రైతులు

ఆత్మకూరు, జూన్ 30 : రాష్ట్రంలో సహకార సంఘాల్లోని మెజార్టీ సభ్యులు, రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని ఆమోదం తెలుపుతుందని జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం ఆత్మకూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక మహాజన సభను పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సాయంపై రైతుల అభిప్రాయాలను సేకరించాలనే ఉద్దేశంతో ప్రత్యేక మహాజన సభలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆత్మకూరు, చౌళ్లపల్లి, గూడెప్పాడ్, తిరుమలగిరి, కొత్తగట్టు, మల్కపేట గ్రామాల్లోని 105మంది రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రతి ఎకరాకు జూన్‌లో రూ. 7,500, నవంబర్ లేదా డిసెంబర్‌లో రూ.7,500 చొప్పున వేయాలని రైతులు సూచించారు. సాగు భూములన్నింటికీ రైతు భరోసా ఇవ్వాలన్నారు. చాలా మంది రైతులు 5ఎకరాల వరకు అమలు చేయాలని, ఐటీ చెల్లించే వారికి, రియల్ ఎస్టేట్, బీడు భూములు, నకిలీ పట్టా పాస్ పుస్తకాలున్న వాటికి పెట్టుబడి సాయం ఇవ్వొద్దని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులకు రైతుభరోసా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఏఈవో సౌమ్య, పీఏసీఎస్ డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, దుగ్యాల శ్రీను, పరికి పుష్ప, వీర్ల వెంకటరమణ, కంచె సతీశ్, సీఈవోలు ఓం ప్రకాశ్ రెడ్డి, ఓదెల లక్ష్మయ్య, శ్రీనివాస్, మోహన్ పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి

రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలి. సహకార సంఘాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేసి ఆదుకోవాలి. పది ఎకరాల వరకు రైతు భరోసా అందించాలి.

–కాడబోయిన రమేశ్, ఆత్మకూరు

ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వొద్దు

రైతు భరోసా పథకం ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులకు వర్తింపజేయొద్దు. 5ఎకరాల్లోపు వ్యవసాయదారులకే అమలు చేయాలి. ప్రభుత్వం సర్వే చేసి అసలైన రైతులను గుర్తించాలి. సాగులో ఉన్న భూములకే వర్తింపజేయాలి. బంజారు భూములు, అటవీ, గుట్టలను పరిగణలోకి తీసుకోవద్దు. నిజమైన రైతులకు మేలు జరిగే విధంగా చూడాలి.

– నిమ్మకాయల చందర్, ఆత్మకూరు

ఇప్పటికీ రైతు భరోసా అందలె..

వానకాలం ప్రారంభమైనా ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వలేదు. గతంలో వానకాలం ముందే కేసీఆర్ ప్రభుత్వం సాయం అందించింది. రైతు భరోసా డబ్బులు అందక పెట్టుబడి కోసం అప్పులు తెచ్చి ఇబ్బందులు పడుతున్నాం. రైతులకు వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు సబ్సిడీలో అందించాలి. వరి పంటకు బోనస్ ఇవ్వాలి.

– పులుసేరు పైడి

ప్రజా పాలనలో అరెస్టులు న్యాయమా?

- నిరుద్యోగుల హామీలు నెరవేర్చకపోతే ఊరుకోం
- బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బైరపాక ప్రశాంత్

హనుమకొండ, జూన్ 30 : ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఎం పర్యటన సందర్భంగా ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం న్యాయమా అని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ప్రశ్నించారు. ఆదివారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులను అరెస్టు చేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ క్యాలెండర్, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులను మూడు వేలకు ఉద్యోగాలు పెంచుతామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. స్వరాష్ట్ర సాధనకు ఏవిధంగా పోరాటం చేశామో అదే తరహాలో నిరుద్యోగ యువత తరపున పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నప్పటికీ అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలి క్యాబినెట్‌లోనే 25వేలతో మెగా డీఎస్సీ నిర్ణయం తీసుకొని నోటిఫికేషన్ విడుదల చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు, మంత్రులు నిరుద్యోగులపై సానుకూల వైఖరిని ప్రదర్శించాలని, ఉద్యోగ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు కంజర్ల మనోజ్‌కుమార్, అర్బన్, రూరల్ కో ఆర్డినేటర్లు లంక రాజ్‌గోపాల్, గండ్ర కోట రాకేశ్‌యాదవ్, పిల్లల నాగరాజ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి వీరస్వామి, టీజేఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పబ్బోజ్ శ్రీకాంత్‌చారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై ప్రజావాణి

దామెర, జూన్ 30 : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సమస్యలపై సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఏఈ గుర్రం రమేశ్ ఆదివారం తెలిపారు. ప్రజలు నేరుగా సబ్‌స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలను తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు.

మహాజన సభకు రైతులు తరలిరావాలి

దామెర, జూన్ 30 : మండలంలోని ఊరుగొండ రైతు వేదికలో 2న పెద్దాపురం పీఏసీఎస్ ఆధ్వర్యంలో జరిగే ప్రత్యేక మహాజన సభకు రైతులు తరలిరావాలని చైర్మన్ బొల్లు రాజు కోరారు. ఆదివారం ఊరుగొండ పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుబంధు పథకం అమలు చేసే విధి విధానాలపై మధ్యాహ్నం 2గంటలకు రైతుల అభిప్రాయాలను స్వీకరిస్తామన్నారు.

నేటి నుంచి రాజధాని బస్సు చార్జీలతో గరుడ ప్లస్ సేవలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 30 : హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు రాజధాని బస్సు చార్జీలు రూ.370తో సోమవారం నుంచి గరుడ ప్లస్ బస్సులో ప్రయాణించవచ్చని వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో నాగేశ్వర్‌రావు

వంగపహాడ్‌లో రైతుల అభిప్రాయ సేకరణ

హసన్‌పర్తి, జూన్ 30 : గ్రేటర్ రెండో డివిజన్ వంగపహాడ్‌లో రైతుబంధుపైన ప్రత్యేక మహాజన సభ ఆదివారం నిర్వహించారు. డీసీవో నాగేశ్వర్‌రావు హాజరై రైతుల అభిప్రాయాలు, సలహాలు స్వీకరించారు. పీఏసీఎస్ చైర్మన్ మేరుగు రాజేశ్‌గౌడ్, ఏఈవో అనుష పాల్గొన్నారు.

'ప్రైవేట్' ఫీజుల దోపిడీని అడ్డుకోవాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 30 : ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు విద్యను వ్యాపారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చంద్రరావు మండిపడ్డారు. ఏఐకేఎఫ్ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు వెంకటేశ్వర్లు అధ్యక్షతన హనుమకొండలో నిర్వహించారు. ముఖ్యమంత్రి వరంగల్‌లో ప్రైవేట్ దవాఖానలను ప్రారంభిస్తూ ప్రభుత్వ వైద్యంపై మాట్లాడడం శోచనీయమన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోత్ రాజేశ్‌నాయక్, రంగస్వామి, సహాయ కార్యదర్శి చందగణేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజయ్, నగేశ్, వెంకట్, వీరబాబు, చంద్రకాంత్, రాకేశ్, మంగేశ్, రాజేశ్, వంశీ పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

ఎల్‌ఓసీ అందజేస్తున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి

హనుమకొండ, జూన్ 30 : లింగాలఘనపూర్ మండలం నేలపోగుల గ్రామానికి చెందిన కట్ల శ్రీను అనారోగ్యానికి గురికావడంతో దవాఖాన ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2.50లక్షల ఎల్‌వోసీని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం బాధితులకు హనుమకొండలోని నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దూసరి గణపతి పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

కాజీపేట, జూన్ 30 : కాజీపేట స్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం అనాథలకు గురుదక్షిణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనాథ వృద్ధులు, స్టేషన్‌లో ఆశ్రయం పొందుతున్న వారికి అన్నదానం చేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు.

అకారణంగా ముగ్గురు యువకుల దాడి

గీసుగొండ, జూన్ 30: మచ్చాపురంలో తాగిన మైకంలో ముగ్గురు యువకులు ఓ వ్యక్తిపై దాడి చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బిల్ల భిక్షపతి ఆదివారం సాయంత్రం మచ్చాపురం స్టేజీ వద్ద ఉన్న హోటల్ ఎదుట అదే గ్రామానికి చెందిన మర్రి కుమారస్వామి, బిల్ల రాజేందర్, బిల్ల కుమారస్వామితో మాట్లాడుతున్నాడు. బైక్‌పై వచ్చిన కోలా సునీల్, సంగినేని విక్రమ్, హజ్జు అకారణంగా భిక్షపతిపై కర్రలతో దాడి చేశారు. స్థానికులు 100కు డయల్ చేశారు. పోలీసులు చేరుకొని భిక్షపతిని దవాఖానకు తరలించారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు పిల్లలతో సహా మహిళ అదృశ్యం

చెన్నారావుపేట, జూన్ 30: ఇద్దరు పిల్లలతో సహా ఓ మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని నారాయణతండా పరిధి జోజిపేటలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ సుధాకర్, శైలజ(25) దంపతులకు పిల్లలు వర్షిత, అభిషేక్ ఉన్నారు. శైలజ భర్తతో గొడవపడి గత నెల 29న ఉదయం ఇద్దరు పిల్లలను తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధుమిత్రుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శైలజ తండ్రి గుగులోత్ రంజ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

వేయిస్తంభాల గుడిలో గ్రేటర్ కమిషనర్ పూజలు

మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను ఆశీర్వదిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ చౌరస్తా, జూన్ 30 : చారిత్రక వేయిస్తంభాల దేవాలయంలో నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆమె కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ వారికి ఆలయ మండపంలో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. కుడా గార్డెన్ దారిని పరిశీలించారు. కుడా వర్కింగ్ కాంట్రాక్టర్ గార్డెన్‌ను పరిశుభ్రంగా ఉంచడం లేదని భక్తులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ గోధుమల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

టెక్స్‌టైల్ పార్క్ సమగ్రాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల, జూన్ 30 : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే టెక్స్‌టైల్ పార్కులో మూడు కంపెనీలు ఉండగా, అందులో కిటెక్స్ కంపెనీ మూడు నెలల్లో ఉత్పత్తిని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందన్నారు. కంపెనీల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. టెక్స్‌టైల్ పార్కులో వరద నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేకంగా బండ్ నిర్మించడంతోపాటు భూములు ఇచ్చిన రైతుల ఇండ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా 16ఎకరాలు కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. ఎంపీపీ స్వర్ణలత, నాయకులు సోదా రామకృష్ణ, కట్కూరి దేవేందర్, కొయ్యడ శ్రీనివాస్, పాడి కల్పనాదేవి, పావుశెట్టి వెంకన్న పాల్గొన్నారు.

నేడు కొత్తకొండ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

భీమదేవరపల్లి, జూన్ 30 : కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ హుండీ ఆదాయం సోమవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి హుండీ ఆదాయం లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టిన లారీ

యువకుడి పరిస్థితి విషమం.. హైదరాబాద్ తరలింపు

లారీ కింద పడి నుజ్జునుజ్జయిన బైక్

ఐనవోలు, జూన్ 30 : లారీ అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టిన ఘటన జరిగింది. ఎస్సై అనిల్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైజాగ్ నుంచి వయా వరంగల్ మీదుగా రాజస్థాన్ వెళ్తున్న లారీ ఓవర్ స్పీడ్‌తో మండలంలోని పున్నేల్ క్రాస్ వద్ద అదుపుతప్పి మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన మామిండ్ల అభిలాష్ ద్విచక్రవాహన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనం, యువకుడిని లారీ సుమారు 5 మీటర్ల దూరం వరకు లాక్కెళ్లింది. దీంతో అభిలాష్ ఎడమ కాలు పూర్తిగా నుజ్జునుజ్జయింది. వెంటనే స్థానికులు యువకుడిని లారీ కింద నుంచి బయటి తీసి, చికిత్స కోసం 108 వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ యశోద హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు. యువకుడి తాత రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హనుమకొండ సీఐ సతీశ్ ఓవరాక్షన్

టీ-20 గెలుపు వేడుకలు చేసుకుంటున్న వారిపై ఆగ్రహం

హనుమకొండ చౌరస్తా, జూన్ 30 : హనుమకొండ సీఐ సతీశ్ ఓవరాక్షన్‌పై ప్రజలు మండిపడుతున్నారు. టీ-20లో భారత్ గెలవడంతో శనివారం రాత్రి హనుమకొండ చౌరస్తాలో సంబురాలు చేసుకుంటున్న రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు దర్శన్‌సింగ్‌తోపాటు మరికొందరితో సీఐ దురుసుగా ప్రవర్తించారు. టీ-20 క్రికెట్‌లో ఇండియా గెలువడంతో వేడుకలు జరుపుకుంటున్న వారిని నెట్టేస్తూ ఇక్కడి నుంచి నడువాలంటూ వెళ్లగొట్టారు. అలంకార్ నుంచి హనుమకొండ చౌరస్తా వరకు ర్యాలీ తీసిన అనంతరం రోడ్డుపై అందరూ సంబురాలు చేసుకుంటుంటే సీఐ వచ్చి నెట్టేస్తూ ఇక్కడి నుంచి నడువంటూ వెళ్లగొట్టారు. ఇండియా గెలిచింది సార్.. సంబురాలు చేసుకుంటున్నామని దర్శన్‌సింగ్ అంటున్నా వినకుండా చెదరగొట్టారు. వీడియో తీస్తున్న వారి ఫోన్ లాక్కోవడం, ఈ వీడియో వాట్సాప్‌లో చక్కర్లు కొట్టడంతో సీఐ తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సీఐ తీరుపై రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీక్ అన్సారీ కూడా మండిపడినట్లు, సోమవారం సీపీకి సీఐపై ఫిర్యాదు చేయనున్నట్లు దర్శన్‌సింగ్ తెలిపారు.

యూనివర్సిటీ భూములు కబ్జా కాకుండా చూడాలి

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్

హనుమకొండ చౌరస్తా, జూన్ 30 : కాకతీయ యూనివర్సిటీ భూములు కబ్జా కాకుండా చూడాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ అన్నారు. కేయూ సెనేట్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ స్టూడెంట్స్ మహాసేన ఆధ్వర్యంలో 'ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, చట్టాల'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టానికి లోబడి పని చేయాలనీ, జీవితం నాశనం చేసుకోవద్దన్నారు, కార్యక్రమం లో రిజిస్ట్రార్ మల్లారెడ్డి, రాజమణి, జయరాం, ఆరేపల్లి రాజేందర్, కోలా ఆనంద్ కిశోర్, ఎల్పీ రాజ్ కుమార్, చిలువేరు రాజ్‌కుమార్, గాదెపాక అనిల్, గజ్జి దయాకర్, కేతవాత్ కుమార్ పాల్గొన్నారు. అలాగే కేయూ దూరవిద్య కేంద్ర ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి రామచందర్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడిని కలిసిన ఎస్సీ మోర్చా నేతలు

హనుమకొండ : షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు రామచందర్‌ను ఎస్సీ మోర్చా నేతలు నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో కలిసి పూల మొక్కను అందజేశారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు, నాయకులు పోలెపాక మార్టిన్ లూథర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు భద్రయ్య, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు జిలకర వీరస్వామి, ప్రధాన కార్యదర్శి నడిగంటి నర్సింగ్, జన్ను సుబ్రహ్మణ్యం ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఐనవోలు, జూన్ 30 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం జరిగింది. ఎస్సై అనిల్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంథిని శివారులో వరంగల్ నుంచి తొర్రూరుకు బైక్‌పై వెళ్తున్న తొర్రూర్ అంబేద్కర్ నగర్‌కు చెందిన ప్రశాంత్ అదుపు తప్పి బ్రిడ్జి గోడకు ఢీకొని కింద పడ్డాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు.

రక్తదాతలు ముందుకు రావాలి

రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు

హనుమకొండ, జూన్ 30 : తలసీమియా బాధితుల కోసం రక్తదాతలు ముందుకు రావాలని రెడ్‌క్రాస్ రాష్ట్ర ఎంసీ మెంబర్ ఈవీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని 59వ డివిజన్ ఇందిరా నగర్‌కాలనీలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. డాక్టర్ తాహిర్ మసూద్, రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యుడు బిల్లా రమణారెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా కిడ్స్ అథ్లెటిక్స్